# శూర్పణఖ శోకం

రామరాజు భగభగమని మండిపోయాడు. కుతకుతలాడిపోయాడు. పొగలు చిమ్మాడు. అవిర్లు కక్కాడు. తనకి జరిగిన అవమానానికి ప్రతీకారం చేసి తీరాలని నిర్ణయించుకొన్నాడు.

అతనికి రావణరావు, తన కన్నుకప్పి సీత నెత్తుకుపోవడం అవమానం అనిపించింది. పగవాడి దగ్గర తన భార్య ఎటువంటి కష్టాలు పడ్తోందో అన్న ఆలోచన కాదతన్ని బాధపెట్త. పగవాడు తనభార్యతో సరసాలాడ్తుంటే తనుగాజులు తొడుక్కూర్చున్నాడని జనం నవ్విపోతారేమోనని బాధపడ్డాడు. రావణరావు ఇంతకింత అనుభవించాలి! అప్పుడే తన మనస్సుకి శాంతి, పౌరుషానికి విలువ.

ఆలోచనలతో వేడెక్కిన రామరాజు, లచ్చుమయ్య అనుసరించి రాగా చుట్టుపట్ల ప్రదేశాలు చుట్టిరావటానికి వెళ్లాడు. దక్షిణంగా కొంతదూరం పోయేసరికి ఓపూలతోట కనిపించింది.

"మన రావణ్రావుగోరి సెల్లెల్తోటన్నా" అన్నాడు లచ్చుమయ్య.

"తెలుసు" అన్నాడు గంభీరంగా రామరాజు ఆపైన-,

"అయితే ఏం చెయ్యమంటావు!" అని లచ్చుమయ్యని కసురుకొన్నాడు.

"నానేటి అనలన్నా! నీకూరికే గాపకం సేశా".

"ఏట్రా! ఈ శూర్పణఖ ఆ రావణాసురిడి చెల్లెలని నువ్వు గ్నాపకం చెయ్యాలేట్రా!" అని విసుక్కున్నాడు.

తను కాలేజీలో చదువుకొనే రోజుల్లో ఈ పిల్లకి చుప్పనాతి గుణం ఉందని, రావణ్రావు చెల్లెలని శూర్పణఖ అని పేరు పెట్టారు అబ్బాయిలు. తనంటే అభిమానం చూపించేది. రావణరావు ఆమెకు మంచి సంబంధమే చేశాడు. ఆమె మొగుడు మరో దాన్ని చూసుకొని ఈమెనొది లేసినప్పటి నుంచి ఈ తోట చూసుకొని పూలూ పళ్లూ అమ్ముకొని బతుకుతోంది దర్జాగా. అప్పుడప్పుడు తన పర్ణశాలకి వచ్చి సీతని పలకరించిపోతూ ఉండేది. కాని ఈ మధ్య రావటం మానేసింది.

"నన్ను మీరు అభిమానంగా చూసుకొంటారని ఆ పిల్లకి కొంచెం అసూయ" అంది సీతోసారి తనతో నవ్వుతూ.

అలా నవ్వి ఊరుకొందేగాని, శూర్పణఖతో రాకపోకలు తెంపుకోలేదు. మొహం చెండుకోలేదు.

తనకోసం సీత ఎదురుతెన్నులు చూసేది తనెక్కడికైనా వెళ్తే!

ఆ రోజు లచ్చుమయ్యా, తను ఇంటికి వచ్చేసరికి గుమ్మంలో సీత తనకోసం

ఎదురుచూస్తూ నిలబడిలేదు. ఆ రోజు రామరాజుకి గుర్తుకువచ్చింది.

"సీతా!" అని పిలిచాడు. సీత పలకలేదు.

"సీతా!" అని అరిచాడు. సీత ఓయ్ అని జవాబివ్వలేదు.

"సీతా!" అంటూ దిక్కులు పిక్కటిల్లేటట్టు కేకపెట్టాడు. సీత పరిగెత్తుకురాలేదు.

సీత తనతో చెప్పకుండా టౌన్లో సినిమాకైనా వెళ్లదే! చీటీ పెట్టిందేమోనని ఇల్లంతా వెతికాడు. అటువంటి చీటీ ఏదీ కనిపించలేదు.

అప్పుడు రామరాజుకి గుర్తుకువచ్చింది తను దశకంఠస్వామి సేవలకి సీతని నియోగించినట్టు. తోటలో ఓ మూలగా ఉన్న పాకవైపు నడిచాడు. అక్కడ అలికిడి లేదు. లోపలికి వెళ్లి చూశాడు. పూజాద్రవ్యాలు ఎక్కడ పెట్టినవి అక్కడే ఉన్నాయి. గది ఏదో వాసన, ఆసుపత్రి రకం వాసన వేస్తోంది. ఎవరికైనా దెబ్బలు తగిలాయేమో!అనుకున్నాడు.

బయటికి వచ్చి "లచ్చుమయ్యా!" అని పిలిచాడు.

"వస్తున్నా! అన్నా!" అని వచ్చాడతను.

"అమ్మేదిరా! ఎధవా!" అని అడిగాడు రామరాజు.

"నాకు తెల్దన్నా! నాన్నీతో ఒచ్చేసినాను కాదా!"

"నేను రమ్మనన్దే ఎందుకొచ్చావురా ఎధవన్నరెధవా!"

"నువ్వు రమ్మననేదు. అమ్మ పొమ్మంది. పోయి సూడు! మన కారు దూరాన్న ఆగిపోయినట్టుంది. తొయ్యాలో!ఏటో!పోయి సూడు. ఇదసలే అడవి. అక్కడ మన కార్నేకపోతే ఎనిక్కిపొ్రా. అది మన కారే అయితే ఈ సంచట్టుకెల్లి అన్నతో సెప్పి టౌన్నుంచి నాన్సెప్పిన సరుకుల్దెచ్చే. అందన్నా! నేనొచ్చేసరికి నువ్వు కారుకింద తొంగునున్నావు కదా! నాను కారు తోసినాను. కారు బుర్రంటూ సార్టయింది.దార్లో మరోపాలి తొయ్యడాని కుందామని లోపలి కూకుండిపోనాను గమ్మున".

"ఈ స్వామీజీ ఏడ్రా?"

"నా కెరికనేదన్నా!"

నిశ్శబ్దం తాండవించింది కాస్సేపు.

"అమ్మనెంటేసుకొని సాములోరు ఈస్పరుడి గుడికెళ్ళుండడా!" అన్నాడు లచ్చుమయ్య.

"లేపుకొనిపోయాడన్నావు కాదురా నా కొడకా!" అని కసురుకొన్నాడు రామరాజు లచ్చుమయ్యని.

రామరాజుకి అనుమానం మర్రివిత్తనంలా పడింది. కాస్సేపట్లో అది మహావృక్షమై పోయింది. "ఇందాక సామి పాకలో నాకేసిన వాసన ఏటై ఉంటుంది!" అని ఆలోచనలో పడి మరోసారి ఆ పాకలో కెళ్ళాడు. ఆ వాసన మరోసారి పీల్చి క్లోరోఫామ్ అని పోల్చుకొన్నాడు.

"నువ్వు దొంగ స్వామివిట్రా దొంగనా కొడుకా! పోల్చుకోలేకపోయాను. నాకు టోపీ

వేస్తావుట్రా ! కేటు నాకొడకా! నా పెళ్లాన్నెత్తుకు పోతావుట్రా తొత్తునాకొడకా" రామరాజు బుసకొట్టాడు.

సీతకోసం, స్వామికోసం గాలించాడు. చావడానికి సిద్ధంగా ఉన్న జట్కాబండి వాడు "నా పక్కనుంచి రాకెట్టునాగా మోటారు దూసుకుపోనాది బాబు. దానెనకాతల అమ్మగోరు మూటలా కూకునున్నారు. దాన్ని తప్పకో బోయినాను. గోతిలో అడిపోయి సావు దెబ్బలు తిన్నాను" అని చెప్పాడు.

రామరాజుకి జరిగినది అర్థమైంది. "ఇది రావణరావుగాడిపని" అని పోల్చుకొన్నాడు.

రావణరావుకి రామరాజుకి వ్యాపారంలో చుక్కెదురు. రావణరావు ఆ ఊరివాడు. రామరాజు తండ్రి మరో జిల్లా నుంచి వచ్చి ఆ ఊళ్ళో స్థిరపడ్డవాడు. రావణరావు వంశపారంపర్యంగా వస్తున్న వ్యాపారం చేస్తుంటే రామరాజు ఆ వ్యాపారంలో దిగి దాంట్లో ఏకచ్ఛత్రాధిపత్యం సంపాదించాలని ప్రయత్నించసాగాడు. దానితో రావణరావుకి మండసాగింది.

రావణరావు తన నమ్మకస్తులను రామరాజు పనిలోపెట్టి, కూపీలు లాగి ఇన్‌కమ్‌టాక్సు వాళ్లకి ఆ కూపీలందించాడు. రామరాజు తన వ్యాపారంఅంతా సవితి తమ్ముడికి అప్పగించి తప్పుకొన్నాడు. ఆ తమ్ముడి మేనమామకి బోలెడు పలుకుబడి ఉంది. అతగాడు డబ్బు వెదజల్లి కేసులు మాపీ చేయించే ప్రయత్నంలో పడ్డాడు.

రామరాజు రెండేళ్ల క్రితం టౌనుకి దూరంగా ఉన్న తోట ఎందుకైనా పనికి వస్తుందని కొన్నాడు. వ్యాపారంలోంచి తాత్కాలికంగా తప్పుకొన్న రామరాజు మంచి పేరు తెచ్చుకొని, బురద కడుక్కునే ప్రయత్నంలో ఆ తోటలో అన్ని వసతులతో ఇల్లు కట్టుకొని దానికి పర్ణశాల అని పేరు పెట్టుకొని సీతతో కాపురం పెట్టాడు. లచ్చుమయ్యని తోడు తీసుకువెళ్లాడు.

ధనం పట్ల తన కాపేక్షలేదని నిరూపించుకోడానికి నారబట్టలు ధరించసాగాడు. యోగ్యుడన్నబిరుదు సంపాదించడానికి సత్సంగం పెట్టుకొన్నాడు. దేవుడి ఏజెంట్లయిన స్వామిజీల కంటే ఇంకెవరు యోగ్యతా పత్రాలు ఇవ్వడానికి అర్హులు! అని ఆలోచించి స్వామీజీలపై తన దృష్టి తిప్పుకొన్నాడు.

అటువంటి రోజుల్లో అతను దశకంఠ స్వామీజీ గురించి విన్నాడు. ఆ స్వామి ఈశ్వరార్చన చేస్తుంటే పది కంఠాలతో పాడినట్టుంటుందని, "ఘంటసాల, బాలసుబ్రమణ్యం, రాజా, మాధవపెద్ది, పిఠాపురం, ఎమ్మెస్ రామారావు, పి.బి. శ్రీనివాస్, రఘురామయ్య, సూరిబాబు, రాజేశ్వరరావు కంఠాలు ఆ పదికంఠాలతో పలికిస్తాడని విన్నాడు. రామరాజు ఆ స్వామిజీని తన పర్ణశాలకి వచ్చి ఓ వారంపాటు భిక్ష స్వీకరించమని కోరాడు. స్వామి అంగీకరించాడు.

రామరాజు బలహీనత తెలిసిన రావణరావే ఆ వేషం వేశాడని రామరాజుకి తెలియదు.

అతని దురాలోచన తెలిసిన రావణరావు భార్య, "మీరు, మీరు బలాబలాలు

తేల్చుకోవాలి గాని, సీతను మీరు ఎత్తుకురావటం ధర్మం కాదు. ఆ రామరాజు నన్నెత్తుకుపోతే మీరు భరించగలరా!" అని బుద్ధి గరపబోయింది.

"నోరు మూసుకో! నేనతనిలాగా ఫూల్‌ని కాను. ఊరుకి దూరంగా పాకేసుకొని నీతో కాపురం చెయ్యడంలేదు. నీకు పదిమంది పనివాళ్లు కాపలా! అయిదు వేటకుక్కలు కాపలా! నీకేసి తేరిపార చూడ్డానికి కూడా రామరాజు వశం కాదు" అని గర్వంగా మీసం మెలివేశాడు రావణరావు.

దశకంఠస్వామి వేషంలో రామరాజు తోటలో పర్ణశాల నుంచి దూరంగా పాకవేయించుకొని మకాంపెట్టాడు. సమయం చూసుకొని క్లోరోఫామ్‌తో సీతను వశపర్చుకొని సీత నెత్తుకుపోయాడు. తనకి లంకంత కొంప ఉన్నా సీతను మరోచోట దాచాడు, రామరాజు సెర్చివారంటుతో వచ్చినా ఉత్త చేతులూపుకొంటూపోవాలని. "ఈ రామరాజేమి చెయ్యగలడు! ఏ సాక్ష్యమూ లేదు నాకు వ్యతిరేకంగా" అని విర్రవీగాడు.

రావణరావు శూర్పణఖ విషయం మర్చిపోయాడు. కాని రామరాజు కారోజు శూర్పణఖ రావణరావు చెల్లెలన్న విషయం గుర్తుకొచ్చింది.

మరురోజు రామరాజామె యింటికేసి షికారెళ్లినట్టు వెళ్లి "ఓసారి మా తోట చూడ్రాదా! మా సీత లేదని రావటం మానేసి నట్టున్నారు" అని శూర్పణఖని పిలిచాడు. అందులో "సీతలేదు నేను వంటరిగా ఉన్నానన్న" అర్థం శూర్పణఖకు వెంటనే అర్థమైపోయింది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శూర్పణఖ ఆరోజుల్లో ఫైనలియరు బియ్యే చదువుతున్న రామరాజుకి ఓటేసి యూనియన్ ప్రెసిడెంటుగా గెలిపించింది. ఆ రోజుల్లో అతడిని విపరీతంగా అభిమానించేది. కులాలు ఒకటి కావు కుదరదని తెల్సు కనక ఆశ మాత్రం పెట్టుకోలేదు. అవన్నీ శూర్పణఖకి గుర్తుకు వచ్చాయి.

చక్కగా ముస్తాబై ఆ మర్నాడు రామరాజు తోటకెళ్లింది. రామరాజు ముద్దెట్టుకొంటాడనుకొని ముచ్చటపడి వెళ్తే రామరాజు:

"లచ్చుమయ్యా! పొద్దున్న నుంచి సాన పట్టిన కత్తి తీసుకొని ఈ ముండ ముక్కు చెవులు తెగ్గోయి" అన్నాడు తన మనస్సులో కుళ్లు వెళ్లబోసే నవ్వుతో.

"ఇదేం సరసం!" అంది శూర్పణఖ అది హాస్యం అనుకొని.

"వస్తున్నా! అన్నా!" అని లచ్చుమయ్య నిజంగానే కత్తి తీసుకొని వచ్చాడు.

రామరాజు శూర్పణఖ పారిపోకుండా తలుపులు బిగించాడు. ఆ తోటలో పట్టపగలు శూర్పణఖ మీద అత్యాచారం జరిగిపోయింది.

"నీ మొహం మండిపోను! నీ భార్య ముండమోసీను! నేనేం అపకారం చేశాన్రా ముచ్చుముండాకొడక! నీకు శ్రాద్ధం పెట్టా" అని శోకిస్తూ శాపనార్థాలు పెట్టింది.

"నీ అన్న నా భార్యను ఎత్తుకుపోయి నాకవమానం చేశాడు. నేను నీ ముక్కుచెవులు

కోసి మీ అన్నకి బుద్ధి చెప్పాను. పో! పోయి మీ అన్నతో చెప్పుకో! మీ అన్న దగ్గర మొత్తుకో! ఇది కేవలం ఆరంభమే అని అంతం కాదని ముందున్నది ముసళ్ల పండుగని చెప్పు" అని రామరాజు "దాన్ని వీధిలో కీడ్చీరా" అని లచ్చుమయ్యకి ఆజ్ఞాపించాడు. అనుచరు డా ఆజ్ఞని పాలించాడు.

శూర్పణఖ రావణ్రావింటికి వెళ్లింది. అతగాడు పది కంఠాలతోరౌద్రంగా అరిచి డాక్టర్ని పిలిచి చెల్లెలికి కట్లు కట్టించి సర్టిఫికేటు తీసుకొని పోలీసుకేసు పెట్టాడు. పోలీసులు రామరాజుని లాకప్పులో పెట్టారు. రామరాజు తమ్ముడు లాయర్నిపెట్టి కప్ప తీయించాడు. లంచాలిచ్చి సిఫార్సు చేయించి కేసులు కొట్టేయించాడు.

"ఈ పిల్లకి చిన్నప్పటినుంచి చెవులుకొరికే అలవాటు, కొరికించుకొనే అలవాటు ఉంది. ఆ అలవాటువల్ల రామరాజు ఇంటినుంచి వెళ్లినకొద్ది సేపటికి చెవులు కొరికించుకొంది. కొరికినవాళ్లకి పెద్ద పళ్లుండటంతో చెవులు తెగాయి. రావణరావు కోర్టువారికిచ్చిన సర్టిఫికేటులో ఏముంది? చెవులు తెగాయి అని ఉంది. అవి రామరాజు తెగ్గోయించాడనిలేదు. దానికి సాక్ష్యం లేదు. ఇకపోతే ముక్కు. ఈ పిల్ల ఇంగ్లీషు చదువు చదివింది, ఈమెకు పోకింగ్ నోస్ హాబిట్ ఉంది. అడ్డమైన చోట ముక్కు పెట్టడంతో ముక్కు తెగుంటుంది. దాన్ని మా క్లయింట్ తెంపించాడని సాక్ష్యం లేదు. లచ్చుమయ్య కత్తికి రక్తం ఉండటం సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్సు. రాజులిళ్లల్లో ఎన్నో కోళ్లు తెగుతాయి. ఆ రక్తం శూర్పణఖగారి రక్తం ఒకటేనని తేలలేదు" అని వాదించాడు.

ప్రత్యక్ష సాక్షులు లేని కారణంగా కేసు కొట్టేశారు కోర్టువారు.

కోర్టు బయట వికార రూపంతో, "మీ మగవాళ్ల వగలకి మేమెందుకు బలైపోవాల్రా మగవెధవల్లారా! మా అన్న రామరాజు భార్య నెత్తుకపోతే రామరాజు తిన్నగా వెళ్లి వాడి ముక్కు చెవులు తెగ్గోయచ్చుకదా! దానికి ధైర్యం చాలక నా మీద పడ్డాడు. మా అన్న మరో మగాడు! రామరాజుతో వ్యాపారంలో చాలలేక అతని భార్య నెత్తుకుపోయాడు. అదీ వాడి ప్రతాపం. హరిజనులు ఎదుర్తిరిగితే వాళ్లనెదుర్కోలేక వాళ్లు లేనప్పుడు వాళ్ల గూడాల మీదపడి వాళ్ల ఆడవాళ్లని చెరిచే మగధీరులు, పోలీసు వీరులు ఉన్న దేశం ఇది. పోలీసులొచ్చి దొంగవెధవల్ని పట్టుకుపోతే, మిగిలిన దొంగముండాకొడుకులు వచ్చి పట్టిచ్చిన మగవాళ్లని పట్టుకొన్న పోలీసులని వదిలిపెట్టి, ఊళ్లో ఆడవాళ్లని రేప్ చేసే రాజ్యం ఇది. ఎవరు ఎకౌంట్ సెటిల్ చేసుకోవాలన్నా మేమే ఆడవాళ్లం దొరుకుతాం! పగలకి మేమే ఫలహారం అయిపోతాం! మీరు మీరు తేల్చుకోరేంరా వెధవల్లారా! మీరు నాశనం అయిపోండ్రా! దేవుడా! ఈ మగవెధవల ప్రమేయం లేకుండా మాకు పిల్లలు కలిగేలాగా, ఆ కలిగిన సంతానంలో మగపురుగులు లేకుండాను చెయ్యలేవా! లేక నువ్వూ మగాడివేనా!" అంటూ శూర్పణఖ హృదయాలు కరిగించేలాగా శోకించింది.

"అంతేనమ్మ మన ఆడజీవితాలు" అని ఓదార్చింది ఆమె వదిన, రావణరావు భార్య. ●

(ఆంధ్రసచిత్ర వారపత్రిక నవంబర్ 1985)